A1TV NEWS

# ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 29 మంగళవారం। 25। జూలై।2023 పేజీలు 4. వెల :4 /

## ఇక సామాజిక అమరావతి..

# మనందరిది

### --రూ.1,829.57 కోట్ల వ్యయంతో అమరావతిలో చేపట్టనున్న 50,793 ఇళ్ళు.

### -పేదల వ్యతిరేకులంతా హైకోర్టులో 18, సుప్రీంకోర్టులో 5 కేసులు వేశారు: సీఎం జగన్.

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 24:
సోమవారం కృష్ణాయపాలెంలో ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి.. పట్టాలు అందించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అనంతరం వెంకటపాలెంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. "ఇవాళ పేదల విజయంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. పేదల వ్యతిరేకులంతా 18 కేసులు వేశారు. ఇందుకోసం ఎక్కడని గడపంటూ లేదు. మూడేళ్ల తరపున మీ కోసం పోరాటం చేశాం. అందుకే.. ఇది పెత్తందారుల మీద పేదల ప్రభుత్వం సాధించిన విజయం. రాక్షస బుద్ధితో ఉన్నవారితో మనం యుద్ధం చేస్తున్నాం."

సీఆర్‌డీఏ పరిధిలో పేద అక్కచెల్లెమ్మలకు ఇళ్ల నిర్మాణం.. ఈడబ్ల్యూఎస్ లేఅవుట్లలో రూ. 1,829.57 కోట్ల వ్యయంతో అన్ని మౌలిక వసతులతో చేపట్టనున్న 50,793 ఇళ్ల నిర్మాణానికి, 45 సామాజిక మౌలిక వసతుల ప్రాజెక్టులకు గుంటూరు జిల్లా కృష్ణాయపాలెం లేఅవుట్ వద్ద నేడే శంకుస్థాపన చేసిన సీఎం జగన్. వీటిలో ఒక్కో ప్లాట్ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైనవి.

లేఅవుట్ల పరిధిలో పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటుచేసేందుకు రెండు దశల్లో రూ.168 లక్షలతో 28,000 మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోనున్నారు. ఇలా ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల



ఏర్పాటుతో ఒక్కో పేద అక్కచెల్లెమ్మ చేతుల్లో దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు పైగా విలువైన స్థిరాస్తిని పెట్టబోతున్నారు.

ఈ పెత్తందారులు.. పేదవాడికి ఇంగ్లీష్ మీడియం అవసరమా? అని ప్రశ్నించిన వాళ్లు.. తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో చదివిస్తారు. సంక్షేమం అందిస్తుంటే రాష్ట్రం శ్రీలంక అవుతుందంటూ ప్రచారం చేస్తారు. మరి చంద్రబాబు తన హయంలో పేదలకు ఉపయోగపడే పనులు ఎందుకు చేయలేదు అని సీఎం జగన్ నిలదీశారు. పేద పిల్లలు బాగుపడడం వాళ్లకు ఇష్టం లేదు. పెత్తందారుల బుద్ధి ఎలా ఉందో గమనించండి అంటూ ఏపీ ప్రజలకు సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు.



పేదలకు ఇల్లు నిర్మించి ఇస్తే రాజధాని అభివృద్ధి చెందదని కొందరు వాదించారు. పేరుకు ఇది రాజధాని.. అలాంటిది పేదలు ఇక్కడ ఉండకూడదా?. అందుకే.. ఇప్పుడు పేదలకు అండగా మార్పు మొదలైంది. అమరావతిని సామాజిక అమరావతిగా ఇవాళ పునాది రాయి వేస్తున్నా. ఇక నుంచి అమరావతి మన అందరిది. అక్కచెల్లెమ్మల పేరిటే ఇళ్ల స్థలాలు ఇచ్చాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 2.70 లక్షలు ఖర్చు చేస్తున్నాం. 793 ఇళ్ల నిర్మాణం కోసం రూ.1,370 కోట్లు ఖర్చు చేస్తున్నాం. అన్ని సౌకర్యాలతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నాం. నాలుగేళ్లుగా ఎంతో మంచి చేశాం. గత ప్రభుత్వం చేయని మంచి చేశాం. మంచి చేస్తున్న మన ప్రభుత్వానికి మీ ఆశీస్సులు ఉండాలి అని ఆయన ప్రజలను కోరారు.



## మరో భారీ ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో

### ఈ నెల 26న ప్రయోగించనున్న ఇస్రో

### ఏడు ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టే అవకాశం

న్యూఢిల్లీ,జూలై24 ):
ప్రపంచం మొత్తం ఆసక్తిగా భారత్‌వైపు చూసేలా చేసినా ప్రతిష్టాత్మక చంద్రయాన్-3 ప్రయోగం తర్వాత మరో భారీ ప్రయోగానికి సిద్ధం అవుతోంది భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో).. చంద్రునిపైకి వెళ్లే మార్గంలో చంద్రయాన్-3 మిషన్‌ను ప్రారంభించిన కొన్ని రోజుల తర్వాత, ఇస్రో తన తదుపరి భారీ ప్రయోగానికి సంబంధించిన అప్‌డేట్ ఇచ్చింది.. భారత అంతరిక్ష సంస్థ పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ మిషన్‌ను ఈ నెల 26న ప్రయోగించనుంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి ఉపగ్రహం సహా మరో ఆరు ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది.. ఈ ఏడాది ఏప్రిల్‌లో విజయవంతంగా ప్రయోగించిన మిషన్ మాదిరిగానే దాని కోర్-అలోన్ మోడ్‌లో కాన్ఫిగర్ చేయబడింది. ఈ వేరియంట్ అదనపు థ్రస్ట్ కోసం దాని మొదటి దశలో రాకెట్ స్ట్రాప్-ఆన్ మోటార్‌లను ఉపయోగించదు, ఇది మిషన్ అవసరాలకు అనుగుణంగా అనువైన లాంచ్ వెహికల్‌గా మారనుంది.. ప్రాథమిక పేలోడ్, ఉపగ్రహం, బరువు 360 కిలోలు మరియు సింగపూర్ ప్రభుత్వం మరియు ఇంజనీరింగ్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న భాగస్వామ్యంతో అభివృద్ధి చేయబడింది. ఈ ఉపగ్రహం ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ అభివృద్ధి చేసిన సింథటిక్ ఎపర్చరు రాడార్ పేలోడ్‌ను కలిగి ఉంది. ఈ అధునాతన సాంకేతికత అన్ని వాతావరణ అంటే.. పగలు మరియు రాత్రి కవరేజీని అందించడానికి అనుమతిస్తుంది. సింగపూర్ ప్రభుత్వంలోని వివిధ ఏజెన్సీల ఉపగ్రహ చిత్రాల అవసరాలకు మద్దతు ఇస్తుంది.


## కన్నా లక్ష్మీనారాయణకు ఽ గన్ మెన్ల తొలగింపు

**మూడు రోజులుగా విధులకు హాజరుకాని కన్నా గన్ మెన్లు**

**ఆరా తీస్తే భద్రతను ఉపసంహరించినట్టు తేలిన వైనం**

**అంబటి ఒత్తిడితోనే గన్ మెన్లను తొలగించారంటూ టీడీపీ మండిపాటు**

టీడీపీ సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణకు గన్ మెన్లను ఏపీ ప్రభుత్వం తొలగించింది. గత మూడు రోజులుగా కన్నా గన్ మెన్లు విధులకు రావడం లేదు. దీనిపై ఆరా తీస్తే కన్నాకు భద్రతను ఉపసంహరించినట్టు తేలింది. మరోవైపు కన్నాకు గన్ మెన్లను తొలగించడంపై టీడీపీ నేతలు మండిపడ్డారు. సమాచారం కూడా ఇవ్వకుండానే తొలగించారని విమర్శించారు. మంత్రి అంబటి రాంబాబు ఒత్తిడితోనే గన్ మెన్లను తొలగించారని దుయ్యబట్టారు. కన్నా లక్ష్మీనారాయణను సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్‌గా చంద్రబాబు నియమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కన్నా, అంబటిల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది.



## అప్పుడు శాంతిభద్రతలు గుర్తుకు రాలేదా?

# బీజేపీ మహాధర్నాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్



బీజేపీ మహాధర్నాకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు సోమవారం పచ్చజెండా ఊపింది. రేపు... మంగళవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నాకు బీజేపీ అనుమతి కోరగా, పోలీసులు అనుమతిని నిరాకరించారు. దీంతో ఆ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ధర్నా చేసుకోవడానికి కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ రేపు ధర్నా చౌక్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించింది. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నారు. ఈ ధర్నాకు అనుమతిస్తే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ధర్నా చేసినప్పుడు శాంతిభద్రతలకు విఘాతం కలగలేదా? అని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం ధర్నా చేసినప్పుడు శాంతిభద్రతలు గుర్తుకు రాలేదా? అడిగింది. ప్రభుత్వం కనీసం 5,000 మందికి కూడా భద్రత కల్పించకపోతే ఎలా? అని కూడా ప్రశ్నించింది. ఆ తర్వాత బీజేపీ మహా ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ ధర్నాలో 500 మంది మాత్రమే పాల్గొనాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎలాంటి ర్యాలీలు చేపట్టవద్దని పేర్కొంది.

## ఏరు దాటాక తెప్ప తగలేయడం మామా, అల్లుళ్లకు అలవాటే : రేవంత్ రెడ్డి



ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్ రావులపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. మునుగోడులో కమ్యూనిస్టుల మద్దతుతో గెలిచి... ఇప్పుడు ఎర్రజెండా మోసేటోడే లేరని మాట్లాడుతున్నారని విమర్శించారు. 'ఏరు దాటాక తెప్ప తగలేయడం మామా, అల్లుళ్లకు అలవాటేనని మరోసారి రుజువు చేశారు హరీశ్ గారూ' అని ట్వీట్ చేశారు. ఈ ఊసరవెల్లుల గురించి కమ్యూనిస్టు సోదరులు ఎంత త్వరగా అర్థం చేసుకుంటే వారికి, సమాజానికి అంత మంచిదని చెప్పారు. కమ్యూనిస్టులకు కార్యకర్తలు కూడా లేరని... సీపీఐ, సీపీఎం ఉచ్చులో పడొద్దని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ హరీశ్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై రేవంత్ విమర్శలు గుప్పించారు

# కేసి కెనాల్ పిడబ్ల్యూ ఛానల్‌ను మాయం చేసిన సొసైటీ.



**-కెసి కెనాల్ చానల్ ను మింగేసిన పద్మావతినగర్ - సొసైటి లే అవుట్లో పిడబ్ల్యూడి చానల్ మాయం**

**-వర్షపు నీటితో మునిగిపోతున్న పద్మావతి నగర్. -ఆక్రమణలతో చిన్నగా మారిన ఛానల్ కాలువ.**

**-కోట్ల రూపాయలు పెట్టి కొన్న ప్రయోజనం లేదంటున్న ప్రజలు. -ఛానల్ పై వెలసిన రోడ్లు ప్లాట్లు .**

**- డిటిసిపి చట్ట నిబంధనలను ఉల్లంఘించిన సొసైటీ - పద్మావతినగర్ ప్రధాన రహదారిపైఆక్రమణ ప్రభావం**

**-చానల్ పై వెలసిన తాత్కాలిక దుకాణాలు.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 24:

నంద్యాల : నంద్యాల జిల్లా కేంద్రంలోని పద్మావతినగర్ హౌసింగ్ సొసైటి అక్రమాల తేనే తుట్టె కదులుతుంది. అక్రమాల పునాదులపై వెలుగొందుతున్న పద్మావతినగర్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే పట్టా భూముల్లో లే అవుట్ వేసిన సొసైటి తాజాగా కెసి కెనాల్ చానల్ ను మింగేసింది. చిన్న చెరువు నుంచి గంగమ్మ తూము పిడబ్ల్యూడి చానల్ ను మాయం చేసింది. ఖాళీ స్థలాలను సొసైటీ స్వాధీనం చేసుకుంటున్న ఘటన మరువక ముందే కెసి కెనాల్ చానల్ ను ఆక్రమించి రోడ్లను వేయడమే కాకుండా చానల్లో ప్లాట్లను వేయడం ఒకవంతయితే చానల్ ను ఆక్రమించి సొసైటి పెద్దలు కొందరు దుకాణాలను నిర్మించుకున్నారు. పద్మావతినగర్ లే అవుట్ అనుమతి సమయంలో డిటిసిపి సూచించిన చట్ట నిబంధనలను సొసైటి ఉల్లంఘించి ప్లాట్లను సభ్యులకు కేటాయించింది. నంద్యాల మున్సిపాలిటి డిటి సిపి సూచించిన ప్లాట్లకు అనుమతులు ఇచ్చి తమ వంతు సహాయ సహకారాలను అందించింది. కెసి కెనాల్ పిడబ్ల్యూటి చానల్ ఆక్రమణకు గురి కావడంతో ఆ ప్రభావం పద్మావతినగర్ ప్రధాన రహదారిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుండటం నంద్యాలలో పెద్ద దుమారాన్ని రేపుతుంది . శ్రీనివాస హౌసింగ్ సొసైటీ విస్తరణలో వెలసిన పద్మావతినగర్ సొసైటి 52.59 ఎకరాల్లో లే అవుట్ ను వేసింది. 576 ప్లాట్లను లే అవుట్లో సొసైటి చూపించింది. నంద్యాల చిన్న చెరువు గంగమ్మ తూము నుంచి పంట కాల్వలకు పిడబ్ల్యూటి చానల్ ఎస్బీఐ కాలనీ మీదుగా పద్మావతినగర్ నుంచి చామకాల్వలో కలుస్తుంది. రాజ్ థియేటర్ ఉద్దిబండ వద్ద కెసి కెనాల్ చానెల్ మూలసాగరం సర్వే నెంబర్ 745, 732 లలో ప్రవహిస్తుంది. 745 సర్వే నెంబర్ 30 సెంట్లు, 732లో 16 సెంట్లు ఉంది. ఉద్దిబండ నుంచి పద్మావతినగర్ సొసైటి ప్లాట్లను వేసింది. చానల్ ప్రవహించే ప్రాంతంలో ప్లాట్లను కేటాయించవద్దని డిటిసిపి నిబంధన విధించింది. జిల్లా కలెక్టర్ అనుమతితో చానల్కు ఇరువైపు రాతి కటకం కట్టి పై భాగంలో స్లాబ్ వేయాలని నిబంధన పెట్టింది. భీమాస్ హోటల్ వెనుక భాగంలో సర్వే నెంబర్ 745లో చానల్ విస్తరణను పూర్తిగా తగ్గించింది. పైభాగంలో సర్వే నెంబర్ 732ను పద్మావతినగర్ ప్రధాన రహదారి మురుగు కాల్వలో కలిపింది. 25 లింకులు కలిగిన 16.5 అడుగుల కెసి కెనాల్ చానల్ సితార హోటల్ వెనుక భాగం వద్దకు వచ్చే సరికి ఐదు అడుగులుగా మారిపోయింది. సర్వే నెంబర్ 732లో 16 సెంట్లు ఉండగా సుమారు 14 సెంట్లను ఆక్రమించినట్లు తెలుస్తోంది. ఆ స్థలంలో సొసైటిలోని కొందరు పెద్దలు సొసైటి సర్వే నెంబర్లను వేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తాజాగా సొసైటీ పెద్ద ఒకరి నుంచి ఒక హోటల్ యజమాని రూ. కోటికి పైగా వెచ్చింది. కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సర్వే నెంబర్ కావడంతో అక్కడ తాత్కాలిక దుకాణాలు మాత్రమే సొసైటి పెద్దల్లో కొందరు ఆక్రమణదారులు నిర్మించుకున్నారు. డిటిసిపి విధించిన చట్ట నిబంధనలను ఉల్లంఘించిన సొసైటీ ఆయా ప్లాట్లను తమకు అనుకూలమైన వారికి కేటాయించినట్లు తెలుస్తోంది. ఆయా ప్లాట్లను కేటాయించవద్దని డిసిపి సూచించిన సొసైటి కేటాయించడం అటుంచితే మున్సిపల్ అనుమతితో కొన్ని ప్లాట్లలో భవనాలు వెలిశాయి. చానల్ ఆక్రమణకు గురి కావడంతో ఆ ప్రభావం పద్మావతినగర్ ప్రధాన రహదారిపై ప్రభావాన్ని చూపిస్తుంది. చినుకు పడితే ప్రధాన రహదారిపై మోకాలు ఎత్తు నీళ్ళు నిలబడతాయి. వర్షపు నీటి నిల్వపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో ప్రజా ప్రతినిధులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. చానల్ ఆక్రమణకు గురైన



విషయం బహిరంగమే అయినా సొసైటీకి అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉండటంతో ప్రజల నిరసన నుంచి బయట పడేందుకు మున్సిపాలిటిపై రూ. 8 కోట్ల భారాన్ని వేయడం కొసమెరుపు.

# జగనన్న సురక్ష సర్వీస్ రిక్వెస్ట్ లను క్లియర్ చేయండి

**-జగనన్నకు చెబుదాం - స్పందన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించండి.**

**-సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 24:

జగనన్న సురక్ష సర్వీస్ రిక్వెస్ట్ లను వితిన్ ఎస్ఎల్ఎ లో క్లియర్ చేయాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమంలో కలెక్టరుతోపాటు డిఆర్వో పుల్లయ్య తదితర జిల్లాధికారులు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా స్వీకరించిన సర్వీస్ రిక్వెస్ట్ లను వితిన్ ఎస్ఎల్ఎ లో క్లియర్ చేయాలని సంబంధిత నియోజకవర్గాల అధికారులు, మండల సురక్ష బృందాలను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం ఆడిట్ లో ప్రజల సంతృప్తి స్థాయికి సంబంధించి గుర్తించిన అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలించాలన్నారు. పాణ్యం, గడివేముల, శ్రీశైలం తదితర మండలాల్లో పెండింగ్ ఉన్న ఈకేవైసీని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులు పూర్తి చేయడంతో పాటు ఇంకా ప్రారంభించని పనులు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను సత్వరమే నాణ్యతతో అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు సంబంధిత అధికారులు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొన్ని వినతులు

1)చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామ కాపురస్తురాలు బి.అరుణమ్మ తన భర్త మహేష్ లు గ్రామం లోని చంద్రశేఖర్ భూమిని 13-09-2021లో కొని రిజిష్టర్ చేయించుకున్నామని....... కానీ ఆన్లైన్ అడంగల్ పాస్ బుక్ ఇవ్వనందున గ్రామం లోని కొందరు వ్యక్తులు ఆ స్థలం మాది అని మమ్మల్ని బెదిరిస్తున్నారని.... మా భూమిపై విచారణ జరిపించి మాకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.

2) బెతంచెర్ల మండలం గోర్లగుట్ట గ్రామ కాపురస్తురాలు ఉసేనిబి భర్త లారీ యాక్సిడెంట్ లో మరణించాడని వైఎస్ఆర్ భీమా పథకం కింద 2 లక్షలు మంజూరు అయ్యాయి కానీ మిగిలిన మొత్తం ఇంకా రాలేదని.... సచివాలయంలో అడిగితే అమౌంట్ చూపడం లేదంటున్నారని మీరే మాకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.




3) కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలానికి చెందిన అఖిల పదవ తరగతి పాణ్యం మండలం సుగాలిమెట్ట గ్రామ సమీపంలో ఉన్న కేజీబీవీ స్కూల్, హాస్టల్ నందు పూర్తి చేసింది మరియు అదే %ఖ+దీఎ% కళాశాల లో ఇంటర్ బైపీసి లో చేరుటకు అనుమతి ఇవ్వగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో 215 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం "స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023" వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డిపిఓ మంజుల వాణి తదితర అధికారులు ఆవిష్కరించారు



## మెడిక్యూర్ హాస్పిటల్ ను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 24:

నంద్యాల బస్టాండ్ సమిపంలోని నూతనంగా ప్రారంభించిన మెడిక్యూర్ హాస్పిటల్ ను సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్.ఏం.తులసి రెడ్డి గారు మరియు నంద్యాల డీసీసీ లక్ష్మి నరసింహ యాదవ్ ,పిసిసి డెలిగేట్ మసూల్దర్ ఫరూక్,పఠాన్ హబిబ్ ఖాన్.ఈ సందర్భంగా డాక్టర్ తులసి రెడ్డి గారు మాట్లాడుతూ నంద్యాల మరియు చుట్టూ పరిసరాల ప్రజలకు అందుబాటులో మెడిక్యూరే హాస్పిటల్ ఉందని,మంచి వైద్యం మరియు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్డియాలజీ నిపుణులు డాక్టర్. హేమబిందు గారినీ అభినందించారు. అలాగే హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్.సునీల్ బాబు,మసూల్దర్ అబ్దుల్ రెహ్మాన్,పొరల్ రాఘవేంద్రలను శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ రఫీ,రామకృష్ణ,షరీఫ్,ఖాసిం,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాకు రెగ్యులర్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ నియమించాలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 24:

నంద్యాల స్పందన కార్యక్రమంలో నంద్యాల జిల్లా రెగ్యులర్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ నియమించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ డెమొక్రటిక్ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ మన్ జీర్ జిలాని శ్యామున్ గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు షేక్.రియాజ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు రెగ్యులర్ జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ ను నియమించాలని ప్రస్తుతం నంద్యాల జిల్లాలో ఏర్పాటు చేసిన జిల్లా మైనారిటీ వెల్ఫేర్ కార్యలయంలో సిబ్బంది లేకపోవడం మరియు రికార్డ్స్ కూడా లేక పోవడంతో అనేక మంది మెడిసిన్ చదివే మైనారిటీ విద్యార్థులు కర్నూలులో ఉన్న జిల్లా మైనారిటి వెల్ఫేర్ ఆఫీసర్ డిఎండబ్ల్యూఓ వద్దకే వెళ్లి మైనారిటీ స్కాలర్ షిప్ స్టేటస్ సర్టిఫికెట్ లు తెచ్చుకోవడం జరుగుతుందని అదే విధంగా 9 వ తరగతి నుంచి ఆపైన ఉన్నత విద్య చదివే విద్యార్థులు కూడా తమ మైనారిటీ స్కాలర్ షిప్లలో ఏవైనా సమస్యలు జరిగితే ఆ సమస్యల పరిష్కారం కోసం స్కూల్ మరియు కళాశాలల ప్రిన్సిపాలు కూడా కర్నూలు జిల్లాకు వెళ్ళవలసి వస్తుందని ఆయన తెలిపారు స్పందించిన జిల్లా కలెక్టర్ మన్ జీర్ జిలాని శ్యామున్ గారు నంద్యాల జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీస్ కు ఆదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి విద్యార్థులకు మైనారిటీ స్కాలర్ షిప్లకు సంబంధించి సమస్యలు ఏమైనా ఉంటే ఇక్కడే పరిష్కరం అయ్యే విధంగా కృషి చేస్తామని ఆయన హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఖాదర్ బాషా,ముక్తర్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్ర ప్రగతి తెలుగు దినపత్రిక

(మంగళవారం। 25। జూలై ।2023

# "ఆడుదాం ఆంధ్ర" క్రీడా సంబరాలకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయండి

**-జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 24:
"ఆడుదాం ఆంధ్ర" క్రీడా సంబరాలకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో "ఆడుదాం ఆంధ్ర" క్రీడా సంబరాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున ప్రారంభించే "ఆడుదాం ఆంధ్ర" పేరిట నిర్వహించనున్న క్రీడా సంబరాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సెట్కూర్ సీఈఓ, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసుకొని గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలను విజయవంతంగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయాల స్థాయి నుంచిమండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా వరకు వరకూ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించాలన్నారు. ఇందుకు గాను గ్రామ, మండల స్థాయిల్లో అనువైన క్రీడా ప్రాంగణాలు, మైదానాలను గుర్తించి వాటిని వివిధ క్రీడల నిర్వహణకు వీలుగా అన్ని విధాలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అంతే గాక ఈ క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు వీలుగా గ్రామ స్థాయి నుండి యువత పెద్ద ఎత్తున భాగస్వాములు అయ్యే విధంగా ప్రోత్సాహించాలని సూచించారు. గ్రామ స్థాయిలో యువజన సంఘాలను భాగస్వాములను చేసే విధంగా అదికారులు ప్రత్యేక చొరవ చూపించాలని సూచించారు. అవసరం అయితే జిల్లా స్దాయిలో ఉన్న అదికారులు గ్రామాల్లో పర్యటించి క్రీడలకు ఉన్న ప్రాధాన్యతను వివరించి అవగాహనా కార్యక్రమాలను రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా క్రికెట్,బాడ్మింటన్, వాలీబాల్,కోకో,కబడ్డి వంటి క్రీడలతో పాటు ఇతర సాంప్రదాయ క్రీడలను కూడా నిర్వహించేలా కార్యాచరణను సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కనుమరుగు అవుతున్న సాంప్రదాయ క్రీడలను గురించి అందరికి అవగాహన కల్పించేలా మహాత్ముని స్పూర్తితో యువతను ముందుకు నడిపించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ సమావేశంలో సెట్కూర్ సీఈఓ రమణ, డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులను మానసికంగా వేధిస్తున్న అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 24:
అడవుల్లో జీవనం సాగించే గిరిజనులకు జీవనోపాధిలో ఆవులను మేపనివ్వకుండా అటవీ శాఖ అధికారులు వేధిస్తూ ఉండడం దుర్మార్గమని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ధ్వజమెత్తారు.సోమవారం స్పందనలో కలెక్టర్ మనజీర్ జిలాని కు వెలుగోడు మండలం గట్టు తాండవాసులతో కలిసి తాము అటవీశాఖ అధికారుల నుండి ఎదుర్కొంటున్న సమస్యలను వేధింపులను గట్టు తాండవాసులు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ వందల సంవత్సరాల పూర్వం నుండి గట్టు తండా వాసులు 30 కుటుంబాలు అడివిలో నివసిస్తూ ఆవులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ తండా వాసులకు మరో ఆధార్కం లేదు. అడవి తల్లినే నమ్ముకుని అడవిలో ఆవుల మేతకు మేపుకుంటుంటే వెలుగోడు రేంజ్ అధికారి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ అడవి తనదేనని భావించి గిరిజనుల పట్ల దుస్సాహసానికి పాల్పడుతూ వారికి మానసికంగా వేధింపులు గురి చేస్తున్నారని కలెక్టర్ ముందు మొరపెట్టుకున్నారు. ఆవుల మందలను అడవిలో మేపనివ్వకుండా వెనక్కి పంపించే ప్రయత్నం చేయడం దుర్మార్గమని అన్నారు. ఆవులకు ఒక్కరోజు మేత లేకపోతే మృతి చెందే అవకాశం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు



గిరిజనుల పట్ల వివక్షత వీడి నోరులేని మూగజీవాలకు రక్షించి అడవిలో ఆవుల మందలను మేపడానికి అనుమతి ఇవ్వాలని కోరారు.. ఈ సమస్య పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున తండావాసులతో కలిసి వెలుగోడు రేంజ్ కార్యాలయం వద్ద రోజువారీగా ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని అన్నారు.

# నరేంద్రమోడీ , అమిత్ షా లు తక్షణమే రాజీనామా చేయాలి.

ఆంధ్ర ప్రగతి కర్నూలు జూలై 24:
మణిపూర్ మహిళలపై జరిగిన అత్యాచారాలు, హత్యలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, హొంమంత్రి అమిత్ షాలు బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేశారు. యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అధ్యక్షతన కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కైలాష్ నాయక్, ఇంటలెక్చువల్ ఆర్గనైజేషన్ నాయకులు ఎక్బాల్, ముస్లిమ్ వెల్ఫేర్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఇనాయతుల్లా లు పాల్గొన్నారు. ధర్నాను ఉద్దేశించి పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ నరేంద్రమోడీ అమిత్ షా ప్రభుత్వం మహిళలను తిరిగి వంటింటికి పరిమితం చేయాలని, మనుధర్మాన్ని అమలు చేయాలని కుట్రలు చేస్తూ, మహిళలపై అత్యాచారాలను,హత్యలను లైంగిక వేధింపులను ప్రోత్సహిస్తుందని ఆమె తెలిపారు. పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతిని ఆహ్వానించక పోవడం, మహిళా రెజ్లర్ల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి పార్లమెంటు సభ్యుడు బ్రిజ్ భూషణ్ సింగ్ పై చర్యలు చేపట్టకుండా, మహిళా క్రీడాకారులు చేస్తున్న పోరాటాన్ని అణిచివేసిన దారుణఘటనలతో పాటు నేడు మణిపూర్ మహిళలపై జరిగిన హింసాకాండ ఘటనలతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ హొంమంత్రి అమిత్ షా లకు మహిళల పట్ల ఎలాంటి గౌరవం లేదన్న విషయం స్పష్టంగా తెలుస్తుందని ఆమె అన్నారు. మనుధర్మాన్ని అమలు పరచాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వ కుట్రలు సాగనివ్వమని రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని ఆమె అన్నారు. మణిపూర్ మహిళలపై జరిగిన దారుణ హింస బిజెపి ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో జరిగిందేనని, దారుణ సంఘటనకు బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళల మాన ప్రాణాలకు రక్షణ కల్పించలేని ప్రధాన మంత్రి, కేంద్ర హొంమంత్రి ఒక్క క్షణం కూడా అధికారంలో ఉండడానికి ఏ మాత్రం అర్హులు కాదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక రాయలసీమ అధ్యక్షురాలు ఈడిగ భారతమ్మ,నంద్యాల జిల్లా




అధ్యక్షురాలు ముడియం సునీత, ప్రధాన కార్యదర్శి కటికె భాను, కర్నూలు టౌన్ అధ్యక్షురాలు రాధ ఉపాధ్యక్షురాలు ఆకుతోట పద్మావతి,ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షురాలు ఎలీశమ్మ, మండల అధ్యక్షురాలు కుర్ది ఈరమ్మ, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షురాలు హుస్సేన్ బీ సి.బెళగల్ మండల అధ్యక్షురాలు వడ్ల ఈశ్వరమ్మ, గోనేగండ్ల మండల అధ్యక్షురాలు ఖాసీంబీ, కోడుమూరు మండల అధ్యక్షురాలు పింజరి దస్తగిరమ్మ , బేతంచర్ల మండల అధ్యక్షురాలు కొమ్ము పెద్దక్క,డోన్ మండల అధ్యక్షురాలు చాకలి సరోజ,నంద్యాల లక్ష్మీ, రేవతీ,సులోచన,వీణా అమీనా,లక్ష్మీ, జయమ్మ, లక్ష్మీదేవి, నాగస్వర్ణ, నారాయణమ్మ, సుబ్బమ్మ,ఈడిగ లక్ష్మీదేవి, మంజుల, బాలమ్మ, రమణమ్మ ,నాగలక్ష్మమ్మ, కోయ మద్దమ్మ,సరోజమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు

# మరోమారు బిఆర్ఎస్‌దే అధికారం

**అభివృద్ధి,సంక్షేమం మా లక్ష్యం**

**ప్రజల అండదండలే కొండంత బలం**

**మంత్రి వేముల ప్రశాంతరెడ్డి**

నిజామాబాద్,జూలై24 :
అభివృద్ధి చేసేవారిని ప్రజలు ఆదరిస్తారని తెలంగాణ ప్రజలు రుజువు చేశారని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై యువకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. ఎవరెన్ని మాటలు చెప్పినా బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.
అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కేసీఆర్ సర్కార్ పని చేస్తున్నదని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తరవాత సిఎం కెసిఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు కారణంగా తెలంగాణ స్వరూపం మారిందని మంత్రి అన్నారు. దీంతో కాంగ్రెస్,బిజెపిలకు భంగపాటు తప్పదన్నారు. గత ఎన్నికల్లో గెలుస్తామంటూ విర్రవీగిన ఈ రెండు పార్టీలకు ప్రజలు చెంపదెబ్బ కొట్టి తీర్పు చెప్పడంతో చతికిల పడ్డారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా మళ్లీ అదే జరగగబోతున్నదని అన్నారు. తెలంగాణలో ఇక బిఆర్ఎస్ తిరుగులేని శక్తిగా ఎదుగిందని ఆయన అన్నారు. ప్రజలే తమ పథకాల ప్రచారకర్తలన్నారు. సంక్షేమం,అభివృద్ధి కళ్లకు కనినిస్తోందని అన్నారు. వ్యయసాయానికి మూడు గంటల కరెంట్ చాలన్న వారికి షాక్ ఇచ్చేందుకు రైతులు, ప్రజలు సిద్దంగా ఉన్నారని అన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణానికి కృషి చేస్తున్న బిఆర్ఎస్‌కు పట్టం కట్టిన ప్రజలు , మళ్లీ కెసిఆర్ నాయకత్వంలో ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఎన్నో అవమానాలు, భరించి లక్ష్యాన్ని సాధించారని గుర్తు చేశారు. ఉద్యమ నేత కేసీఆర్ వల్లే తెలంగాణ బాగు పడుతుందని ప్రజలు అధికారాన్ని అప్పగించారని తెలిపారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా కెసిఆర్ పాలన సాగుతోందని అన్నారు. రేపటి తెలంగాణ బిడ్డల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఆ పనులను కొనసాగించేందుకు పార్టీ పటిష్టంగా ఉండాలనీ, అప్పుడే బంగారు తెలంగాణ సాకారమవుతుందని వివరించారు. మరోమారు బిఆర్ఎస్ అధికారంలో ఉంటేనే అభివృద్ధి,సంక్షేమం కొనసాగుతుందన్నారు.రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడుతున్న వారిని గుర్తించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని తెలంగాణ సమాజాన్ని కోరుకుంటున్నామని అన్నారు. ఈ ఐదేళ్లలో 60 ఏళ్లలో జరగని అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టారని, ఒక్క వ్యవసాయ రంగాన్ని తీసుకుంటే రైతుబంధు, బీమ పథకం, నిరంతర కరెంట్ విప్లవాత్మకమన్నారు. చేసిన పనులను ప్రజలే తెలుసుకుని తమకు ప్రచార కర్తలుగా ఉన్నారని అన్నారు. ప్రపంచంలో ఎన్నో పార్టీలున్నాయనీ, లక్ష్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని నాయకుడు ఒక్క కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. పదువులు ముఖ్యం కాదనీ, పార్టీ బాగుంటే పదవులు వాటంతటవే వస్తాయన్న విషయాన్ని కార్యకర్తలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్ర భుత్వం కృషి చేస్తుందన్నారు. అందుకే తెలంగాణలో ఇతర పార్టీలకు ఇక స్థానం లేదన్నారు. కేసీఆర్ వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిపై ప్రజలే ఆలోచన చేయాలని కోరారు. బీఆర్ఎస్ శ్రేణులు గ్రామాల్లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై చర్చించాలని, ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి సూచించారు.

# చెట్లను నాటుతూ పర్యావరణాన్ని కాపాడండి: ఆర్పీఎఫ్

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 24:
పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు కాలుష్యాన్ని నివారిద్దాం మనల్ని మన చుట్టూ ఉన్నవారిని కాపాడుకుందాం అనే నినాదంతో నంద్యాల రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ గుంటూరు డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ వారి ఆదేశాలు మెరకు 100 మొక్కలను నాటారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని వారు సూచించారు అనంతరం రైల్వే స్టేషన్ పరిధిలో రైల్వే ఇన్స్టిట్యూట్ ఆర్ పి ఎఫ్ బ్యారక్ లో వంద మొక్కలను నాటడం సంతోషంగా ఉందని మొక్కలను నాటడమే కాదు వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు అనంతరం భూమాతకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలోఏఎస్ఐ జి.జయరాములు, ఏఎస్ఐ డి.జనార్దన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఎం ఎస్ సి బోస్,హెడ్ కానిస్టేబుల్ ఎం దాశరథి, కానిస్టేబుల్ పిఎన్ రాజు, డబ్ల్యూ సి అనఖా ఎస్ బి తదితర సిబ్బంది మరియు హెచ్ఐ/ఎన్‌డిఎల్ శ్రీ బి రంగస్వామి వారి సిబ్బంది పాల్గొన్నారు.




# నాయి బ్రాహ్మణులను వేదిస్తున్న ఆలమూరు గ్రామ అగ్రవర్ణాల వారిపై చర్యలు తీసుకోవాలి.

**నాయి బ్రాహ్మణుల భూ సమస్య పరిస్కారం చేయకపోతే నిరాహార దీక్షలకు సిద్ధం అవుతాం.**

**అధికారులను హెచ్చరించిన సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు**




ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జులై 24:
ఆలమూరు గ్రామంలో ఓట్లు వేయలేదని పంట పొలాలను 3సంవత్సరాలనుండి పంట వేయనియకుండా చేస్తున్న అగ్రవర్ణాల దౌర్జన్యం నశించాలని, నాయి బ్రాహ్మణులను వేదిస్తున్న ఆలమూరు గ్రామ అగ్రవర్ణాల వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని,ఆలమూరు గ్రామంలో అగ్రవర్ణాల దౌర్జన్యం ఆపాలని, నాయి బ్రాహ్మణులకు ప్రాణారక్షణ కల్పించాలాని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఈ రోజు ఆళ్లగడ్డ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాముడు,ధనుంజయుడు,ఆళ్లగడ్డ సిపిఐ కార్యదర్శి భాస్కర్, రుద్రవరం మండల కార్యదర్శి నరసింహులు, రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ సోమన్న, జిల్లా నాయకులు డి.శ్రీనివాసులు, సిపిఐ గోస్పాడు మండల కార్యదర్శి హరి,సిపిఐ నంద్యాల పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, సిపిఐ నాయకులు మధు, లింగయ్య,వెంకటేశ్వర్లు, ఆలమూరు గ్రామ భూ సమస్య బాధితులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన మధుమణి చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్సల వైద్య శిబిరం.




ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 24:
మధుమణి నర్సింగ్ హోమ్ నిర్వాహకులు ప్రముఖ ఈ.ఎన్.టి. వైద్యులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మణిదీప్ మరియు డాక్టర్ నాగమణి ల ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న 32 వ ఉచిత చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్సల వైద్య శిబిరం ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ శిబిరంలో మొత్తం 100 మంది కి శస్త్ర చికిత్సలు, వెయ్యి మందికి ఓపిడిలో ఉచితంగా చూడడం జరిగింది. అవసరమైన మందులు పంపిణీ చేశారు. 50 లక్షల విలువైన వైద్య సేవలు నిరుపేదలకు అందించారు. మధుమణి చారిటబుల్ సొసైటీ సహకారంతో డాక్టర్ మధుసూ ధన్ రావు తల్లిదండ్రులు చిత్తలూరు వెంకట శెట్టి, పులమ్మ ల జ్ఞాపకార్థం ఈ శిబిరం ప్రతి ఏటా గత 31 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు.ఈ శిబిరంలో మధు మణి ఆసుపత్రి వైద్యులు మధుసూదన రావు, డాక్టర్ మణిదీప్,డాక్టర్ రోహిత్ లతో పాటు దేశంలో ప్రముఖ చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు జైపూర్ కు చెందిన డాక్టర్ సతీష్ జైన్, బెంగళూరుకు చెందిన డాక్టర్ దీపక్ హల్దిపూర్, డాక్టర్ శంకర్ మెడికేరి, వివిధ నగరాలకు చెందిన డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, డాక్టర్ హర్షద్, డాక్టర్ శ్రీపతి నాయుడు, డాక్టర్ గౌరవ్ మెడికేరి లు పాల్గొని ఉచిత శస్త్ర చికిత్సలు చేశారు. శస్త్ర చికిత్సలకు అవసరమైన అనస్తీషియా సేవలు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మాధవి అందజేశారు.శిబిరం ముగింపు సందర్భంగా డాక్టర్ మధుసూదన రావు, డాక్టర్ మణిదీప్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా తమ మధు మణి చారిటబుల్ సొసైటీ ద్వారా ఉచిత శస్త్ర చికిత్సల శిబిరం ప్రతిఏటా నిరుపేదల కోసం నిర్వహిస్తామని తెలిపారు.32 సంవత్సరాలుగా ఉచిత శస్త్ర చికిత్సల శిబిరాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ మధుసూదనారావు, డాక్టర్ నాగమణి, డాక్టర్ మణిదీప్ లను రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అభినందించారు. డాక్టర్ మధుసూదనరావుకు ఐఎంఏ వైద్యుల దినోత్సవ జాతీయ సేవా పురస్కారానికి ఐఎంఏ జాతీయ నాయకత్వం ఎంపిక చేసిందని తెలిపారు.

# వైకాపా నాయకులారా! కార్యకర్తలారా! కాంగ్రెస్ లోకి రండి.

**-రాజశేఖరరెడ్డి ఆశయాన్ని నెరవేరుద్దాం.**

**-రాష్ట్రంలో జగన్ పని అయిపోయింది**

**- 6 సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తాం..**

**-దర్బార్ టీ స్టాల్ ప్రారంభోత్సవం పాల్గొన్న తులసి రెడ్డి**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 24:
డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్యమంత్రి జగన్ పని అయిపోయిందని, వైకాపా నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి రావాలని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ సరెడ్డి తులసి రెడ్డి గారు నంద్యాల పార్లమెంటు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీ జే లక్ష్మీ నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైకాపా చిత్తుచిత్తుగా ఓడిపోతుందని, జగన్ శంకరగిరి మాన్యాలకు పోక తప్పదని, ఈలోపలే జగన్ జైలుకు కూడా పోవచ్చని తులసి రెడ్డి అన్నారు.

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు జగన్ ప్రభుత్వం పట్ల అసంతృప్తితో ఉన్నారన్నారు. రైతులు రగిలిపోతున్నారు. మహిళలు, మందుబాబులు మండిపోతున్నారు. ఉద్యోగులు ఉడికిపోతున్నారు. యువత ఆవేశంతో ఉన్నారు. కాంట్రాక్టర్లు కసితో ఉన్నారు. సర్పంచులు ఆగ్రహంతో ఉన్నారన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల, అవినీతి, అరాచక, మద్య, జూద, గంజాయి, డ్రగ్ ఆంధ్ర ప్రదేశ్ గా మారిందని నిప్పులు చెరిగారు.

రాష్ట్రంలో ల్యాండ్, పాండ్, మైన్, పైను, ఎర్రచందనం, బియ్యం మాఫియాలు రాజ్యమేలుతున్నాయని విరుచుకుపడ్డారు...

అదానీ వ్యవహారంలో మోడీ ప్రతిష్ట, వివేక హత్య కేసు వ్యవహారంలో జగన్ ప్రతిష్ట అదః పాతాళానికి పడిపోయాయి అన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని వైకాపా నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి రావాలని స్వగృహప్రవేశం చేయాలని తులసి రెడ్డి పిలుపునిచ్చారు.

రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తన జీవితాశయం అని స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి పదేపదే చెప్పి వారని, ఆయన ఆశయ సాధన కోసం అందరూ చేయి చేయి కలుపుదాం అన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 6 సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు.

1. ఆరు (6) లక్షల రూపాయల వరకు వ్యవసాయ రుణాల మాఫీ,
2. 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా.
3. ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు %=౦%.6000 ఆర్థిక సహాయం.
4 సంజీవిని లాంటి ప్రత్యేక హెూదా అమలు,
5. రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్బండ్ తరహా అభివృద్ధి ప్యాకేజీ అమలు. 6. పోలవరం, కడప జిల్లాలో ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం, రాజధానితో సహా విభజన చట్టంలో పేర్కొనబడి అపరిష్కృతంగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించడం.

మీడియా సమావేశంలో నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు , జిల్లా ప్రధాన కార్యదర్శి గార్లపాటి మద్దిలేటి స్వామి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ హబీబ్ ఖాన్ , జిల్లా ఎస్సీ అధ్యక్షులు నాగలింగం, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సంపంగి రామకృష్ణ, జిల్లా ట్రెజరర్ ఎస్ వై డి ప్రసాద్, నంద్యాల పట్టణ ఉపాధ్యక్షులు చాబూలు సలాం, జిల్లా కార్యదర్శి రఫీ, జిల్లా కార్యదర్శి రెహ్మాన్, రియాజ్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 8 గంటల నిరాహార దీక్ష




ఆంధ్ర ప్రగతి పాణ్యం జూలై 24:
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాల అందించాలని, ఖాళీగా ఉన్న మూడువేల అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరుతూ 50 మందితో 8గంటల నిరాహార దీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, డక్క కుమార్, నిరంజన్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తున్నామని విద్యారంగా అభివృద్ధికి వైసిపి తప్ప ఏ పార్టీ కృషి చేయలేదని గొప్పలు మాత్రమే చెప్పుకుంటుందన్నారు . రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించలేమని నీసిగ్గుగా ప్రకటించడం దుర్మార్గమైన చర్య. గత సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించగా ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయక అనేకమంది విద్యార్థులు పరీక్షలలో ఫెయిల్ కావడానికి ముఖ్య కారణమని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు విద్యారంగానికి ప్రకటించకపోవడం వల్లే ఈరోజు రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం నిర్వీర్యం అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ మా అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగున్నర సంవత్సరాలు కావొస్తున్న ఇప్పటికే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ అధ్యాపక పోస్టులు భర్తీ చేయకపోవడం దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామన్నారు. గతంలో ఇంటర్ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దు చేయడం వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గిందని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ప్రతి జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా పాఠ్యపుస్తకాల అందించాలని. ఖాళీగా ఉన్న 3వేల అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు మధు కిరణ్, ప్రతాప్, జిల్లా నాయకులు రమేష్, సిద్దార్థ, కార్తీక్, విద్యార్థులు అబ్దుల్ ఖాదర్, లోకేష్,చరణ్,రంగస్వామి, మద్దిలేటి, సాయి, చంద్రశేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

## - ప్రోత్సహిస్తూనే ఫ్యాక్టరీల ఏర్పాటు

## - రంగంలోకి దిగిన జిల్లా ఉద్యానవన శాఖ

నిజామాబాద్,జూలై24
తెలంగాణ జిల్లాల్లో ఇప్పుడు ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ప్రచారం విస్తృతం చేస్తోంది. ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహాలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో అనేక జిల్లాల్లో మంత్రులు అదేపనిగా ప్రచారం చేస్తున్నారు. తొలుత మంత్రి హరీష్ రావు,తరవాత వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డిలు ఆయిల్ పామ్ సాగుపై ప్రచారాలు
చేపట్టారు. ఇప్పుడు జిల్లా మంత్రి వేముల ప్రశాంతరెడ్డి కూడా పంటల మార్పిడిని ప్రోత్సహిస్తున్నారు. జిల్లాకు చెందిన స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కూడా రైతులను ఆరుతడి పంటలు చేపట్టాలని ప్రోత్సహిస్తు న్నారు.ప్రధానంగా ఆయిల్పామ్పై అవకాశం వచ్చిన ప్రతిసందర్భంలోనూ రైతులను చైతన్యం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఆయిల్పాం సాగును చేపట్టేందుకు ఉద్యానవన శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఆయిల్పాం సాగు మొదలుపెట్టగానే వీటికి సంబంధించిన ఫ్యాక్టరీలను కూడా ఏర్పాటు చేయనున్నారు. సాగును బట్టి ఆయా ప్రాంతాల్లో ఫ్యాక్టరీలను నెలకొల్పుతారు. పంట కోయగానే 24 గంటల్లో ఆయిల్ తీయాల్సిన పరిస్థితి ఉన్నందున అదే రీతిలో ఈ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తారు. రైతులతో ఒప్పందాలు చేసి పంటను ఆయా ఫ్యాక్టరీలకు తరలిస్తారు. నాలుగో సంవత్సరంలో పంట చేతికి వచ్చే సమయానికి విస్తీర్ణంను బట్టి ఫ్యాక్టరీలను నెలకొల్పే అవకాశం ఉందని ఉద్యానవనశాఖ అధికారులు తెలిపారు. ఆయిల్పాం సాగు కోసం రైతులకు మొదట అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. జిల్లాలో మొత్తం 55 ఎకరాల వరకు సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందని ఆయన తెలిపారు. ఈ పంట సాగు చేసేవారికి 75శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోందని
తెలిపారు. ఆయిల్పాంను సాగుచేసే రైతులకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ అందిస్తుంది. ఆయిల్పాం సాగుకు హెక్టార్కు లక్షా27వేల రూపాయలు ఖర్చు అవుతుందని ఉద్యానవనశాఖ అధికారులు అంచనా
వేశారు. ఇందులో హెక్టార్కు 78 వేల రూపాయలను సబ్సిడీ కింద అందించనున్నారు. మిగతా డబ్బులను రైతు తన వాటా కింద చెల్లించాల్సి వస్తుంది. దీంతో పాటు ఎరువులు, ఇతర అవసరా లకు ఇన్పుట్ సబ్సిడీని కూడా అందిస్తారు. ఆయిల్పాం సాగు మొదలుపెట్టిన తర్వాత రెండు, మూడో సంవత్సరంలో కూడా ఇన్పుట్ సబ్సిడీని అందిస్తారు. ఈ ఆయిల్పాం సాగులో నాలుగో సంవత్సరం నుంచి పంట చేతికి వస్తుంది. అప్పటి నుంచి దాదాపు 30 ఏళ్ల పాటు ఆయిల్పాం మొక్కలు ఉంటాయి. ప్రతీ హెక్టార్కు 140 నుంచి 143 మొక్కలను నాటుతారు. ఈ ఆయిల్పాం సాగుతో పాటు అంతర పంటగా పెసరా, సోయా, వేరుశనగతో పాటు ఇతర పంటలు కూడా వేయవచ్చు. వీటిపై కూడా రైతులకు ఉద్యానవనశాఖ అధికారులు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో విడతల వారీగా 55వేల ఎకరాలలో ఆయిల్పాంను సాగు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. మొదట ఈ పంటపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. సాగు నీరు పుష్కలంగా ఉండే గ్రామాల పరిధిలో ఈ ఆయిల్పాం సాగును ప్రోత్సహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 13 మండలాల పరిధిలో సాగు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్ని, బోధన్, రుద్రూరు, కోటగిరి, ఎడపల్లి, నవీపేట, రెంజల్, నిజామాబాద్ రూరల్, మోపాల్, డిచ్పల్లి, నందిపేట, ఆర్మూర్ తదితర మండలాల్లో ఆయిల్పాంను సాగు చేయనున్నారు. ఈ సాగు కోసం ఈ సంవత్సరం రెండు చోట్ల నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నర్సరీల ద్వారా ఆయిల్పాం మొక్కలను పెంచి రైతులకు సరఫరా చేయనున్నారు. జిల్లాలో మొదట 2వేల ఎకరాల్లో ఈ యేడాది ఆయిల్పాం సాగును చేపట్ట నున్నారు. జిల్లాలో విభిన్న రకాల పంటలు సాగుచేసే రైతులు ఈ ఆయిల్ పాం సాగుకు ఎంత మేరకు మొగ్గుచూపుతారో భవిష్యత్తులో తేలే అవకాశం ఉంది.

## సంపాదకీయం

# విద్యారంగంలో విప్లవాత్మక నిర్ణయాలు

సోమవారం 24-7-2023
ఉమ్మడి ఎపితో పోలిస్తే విడివడ్డ తెలుగు రాష్ట్రాల్లో విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు కనిపిస్తు న్నాయి. గతంతో పోలిస్తే బడ్జెట్ కేటాయింపులు పెరిగాయి.మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెరిగింది. బలవర్ధక ఆహారానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. స్కూల్ పరిసరాల్లో మార్పు కనిపిస్తోంది. పాఠశాలలను తీర్చి దిద్దుతున్నారు. ఔత్సాహికుల సాయంతో రూపురేఖలు మారుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ బాగస్వా మ్యంలో పోటీపడి అభివృద్ధి చేస్తున్నారు. స్కూల్ డ్రెస్సులు, ట్యాబులు, పుస్తకాలు ఇలా అన్నీ అందుబాటులోకి తీసుకుని రావడమే గాకుండా ఉచితంగా అందచేస్తున్నారు. విద్యను అందరికీ అంటే సామాన్యులకు కూడా అందుబాటులోకి తేవడం, పోటీ పరీక్షలను తట్టుకునేలా విద్యార్థులను తయారు చేయడంపై ఇద్దరు సిఎంలు దృష్టి సారించారు. ఎపిలో ప్రాథమిక స్థాయినుంచే ఆంగ్ల మాధ్యమాన్ని బోధించాలన్న పట్టుదలతో సిఎం జగన్ అమలు చేస్తున్నారు. నిజానికి ప్రైవేట్ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతో చదువుతున్నప్పుడు ప్రభుత్వ పాఠశాలలో ఎందుకు అలాంటి చదువులు ఉండకూడ దన్న ప్రశ్న వేసుకోవాలి. ఇంగ్లీ మీడియం లేని కారణంగా ఇన్నాళ్లూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపలేదు. కానీ ఇప్పుడు ఎపిలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్ఓ చేరడానికి ఆసక్తి చూపుతు న్నారు. అలాగే ఆంగ్ల మీడియం చదివిన వారెవరూ మాతృభాషను మరవడం లేదు. అలాగని మాతృభాష ను మరచి పోకుండా బోధన జరగాలి. ఆంగ్ల మీడియం అయినా తెలుగులో పట్టు సడలకుండా చూడాల్సిన బాధ్యత అధ్యాపకులదే.. విద్యార్థులకు సంబంధించి బహుముఖ పరిజ్ఞానం అబ్బేలా చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ విద్య ఖర్చుతో కూడుకున్నది కావడం వల్ల ప్రభుత్వ విద్యను ప్రజలకు చేరువ చేయగలగడం నిజంగా అభినందించాల్సిందే. ఇందుకోసం పాఠశాలలను ఆధునీక రించడం, సౌకర్యాలు కల్పించడం, టీచర్లను నియమించడం వంటివి చేయాలి. నాడు-నేడు కింద పాఠశాలలను బాగు చేసే కార్యక్రమంలో ఎపిలో పెద్ద ఎత్తున సాగుతోంది. అలాగే ఆంగ్ల మాధ్యమంలో బోధనకు నిర్ణయాలు తీసుకున్నారు. ఫీజుల కోసం నగదు బదిలీ సాగుతోంది. ఇందుకు అనుగుణంగా ఇంగ్లీష్ బోధించే టీచర్లను రిక్రూట్ చేసి నియమించడం వల్ల అటునిరుద్యోగ సమస్య కూడా కొంత తీరుతుంది. అలాగే పేదలు ప్రైవేట్ స్కూళ్లకు లక్షల్లో తగులబెట్టాల్సిన ఆగత్యం ఉండదు. ఇకపోతే తెలంగాణలో గతంతో పోలిస్తే గురుకులాల ఏర్పాటు వల్ల సామాన్యులకు నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి వచ్చింది. అయితే తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక ప్రకటించినా ఎందుకనో అది పట్టాలకెక్క లేదు. నిజానికి కులమతాలకు అతీతంగా విద్యను అందిస్తానని సిఎం కెసిఆర్ పలుమార్లు ప్రకటించారు. సామాన్యుడి నుంచి, రాజకీయ నాయకుల, అధికారుల పిల్లలంతా ఒకే విద్యా విధానంలో చదవాలన్న ఆకాంక్షను ప్రకటించారు. కులపరమైన హాస్టళ్లు ఉండకూడదని కూడా చెప్పారు. ఇంతటి ఉదాత్తమైన పథకం ఎందుకనో ముందుకు సాగడం లేదు. నిజానికి ఇప్పటి వరకు సిఎం కెసిఆర్ చేస్తున్న పథకాలు ఒక ఎత్తయితే ఈ పథకం ఒక ఎత్తయ్యేది. తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయేది. కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజంలో అంతరాలను తొలగి స్తుంది. అది ఎల్కెజి నుంచే పిల్లల్లో భేదభావాలు లేకుండా చేస్తుంది. ఇప్పుడున్న స్కూళ్లను చూస్తుంటే ఆర్థికస్థాయిని బట్టి నడుపుతున్నారు. అయితే ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉండగానే గురుకులాలు, ఉర్దూమీడియం స్కూళ్ల ప్రారంభించడం, అనేక హాస్టళ్లను కొత్తగా చేప్టటడం వల్ల అసలు పథకం అటకెక్కిందన్న భావన కలుగుతోంది. ఎపి లాగా కెజి టూ పిజి ఉచిత ఆంగ్ల మాధ్యమ విద్యను ప్రవేశ పెట్టాలి. అలాగే తెలుగు మాధ్యమానికి ప్రాధాన్యతను పెంచాలి. ప్రస్తుతానికి విద్యా పరంగా ఇరు రాష్ట్రాల
ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు కూడా మంచి ఫలితాలే ఇస్తున్నాయి. విద్యారంగానికి ప్రభుత్వం కూడా అధిక బడ్జెట్ కేటాయింపులు చేసి వివిధ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి. ఇకపోతే ఇరు రాష్ట్రాల్లో ఒక్కొక్క విద్యార్థిపై ఏటా ఒక లక్ష రూపాయలు వెచ్చిస్తున్నారు. పేదపిల్లలకు కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా చదువు, సౌలభ్యాలు, మౌలిక వసతులు లభించేలా చేస్తే ప్రైవేట్ జోలికి వెళ్లాల్సిన ఆగత్యం పట్టదు. ఇలా మధ్యతరగతి పిల్లల తల్లిదండ్రులకు ఆర్థికభారం కూడా తప్పుతుంది. టెన్త్,ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యాసంస్థలు అగ్రస్థానం సాధిస్తున్నాయి. చదువుకుంటే నిరుద్యోగిగా మిగిలిపోతున్న ప్రస్తుత తరుణంలో ఉపాధికి తగ్గ చదువు దక్కేలా చేయాలి. అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలను, కరికులమ్ను మార్చాలి. పాఠశాల స్థాయి నుంచి నాణ్యమైన విద్యను అందించేందుకు చేస్తున్న కృషి భవిష్యత్తులో సామాజిక మార్పునకు దోహదపడుతుందని రుజువు చేయాలి. అలాగే ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు చదువును కొనే దుస్థితి నుంచి బయటపడేలా చేయాలి. సామాన్యులకు చదవును దగ్గర చేసేందుకు ఎంతయినా ఖర్చు చేయాలి. అప్పుడే విద్యారగం పటిష్టం కాగలదు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గగలదు. లేకుంటే విద్య కోసం పేదలు సైతం లక్షల్లో ఖర్చు చేసేందుకు అప్పుల బారిన పడుతున్నారు. కార్పోరేట్ స్కూళ్ ఫీజు దోపిడీలను అరికట్టాలంటే ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం ద్వారా అటు నిరుద్యోగులకు కూడా ఉద్యోగాలు కల్పించే అవకాశం రాగలదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే నిర్ణీత ఫీజులు చెల్లించేందుకు ప్రజలు కూడా ముందుకు రాగలరు. అందుకు తెలుగు రాష్ట్రాల్లో సాగుతున్న కృషి మరింత ముందుకు సాగాలి. ప్రస్తుత విద్యా విధానంలో ప్రోత్సాహం పెంచేందుకు అసవరమైన నిధులకు వెనకాడరాదు. దీనికితోడు పాఠశాల స్థాయిలోనే క్రీడలను పెద్ద ఎత్తున ప్రోత్స హించాలి. క్రీడలకు సరైన ప్రోత్సహకాలు లేక ఎంతోమంది భావి క్రీడాకారులు మట్టిలో మాణిక్యాల వలె మిగిలిపోయారు. ర్యాంక్లు, మార్కులకోసం పోటీపడే ప్రస్తుత కాలంలో ఆటలు ఆడితే పిల్లలు పాడవుతారని, చదువుల్లో వెనకబడతారనే తల్లిదండ్రులు ఆలోచిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు క్రీడా సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి చూపించడం లేదు. క్రీడలను ప్రోల్సహించేలా పరికాలు, క్రీడా సామాగ్రి లేకపోవడం, ఆడుకోవడానికి మైదానాలు లేకపోవడం వంటి కారణాలూ ఉన్నాయి. విద్యా సంస్థలు సైతం వీటిని ప్రోత్సహించడం లేదు. కార్పోరేట్ స్కూల్ కల్చర్ వచ్చాక క్రీడలను పూర్తిగా విస్మరించారు. కేవలం ఇరుకుగదుల్లో పిల్లలను బందీలను చేశారు. పుస్తకాలను బట్టీ పట్టించడం తప్ప మరోటి వారికి తెలియకుండా చేస్తున్నారు. క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న తీరు గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇలా అన్ని రంగాల్లో విద్యార్థులు విజయాలు సాధించేలా మన విద్యారంగాన్ని తీర్చిదిద్దు కోవాలి.